# కాంగ్రెస్ వస్తే చిమ్మచీకట్లు

- ఆ పార్టీ నాయకుల మాయమాటలు నమ్మొద్దు
- మీ బిడ్డగా ఆశీర్వదించండి.. మరింత అభివృద్ధి చేస్తా..
- ఎమ్మెల్యే అరూరి రమేశ్
- హసన్‌పర్తి మండలంలో ఎన్నికల ప్రచారం
- అరూరికి వాల్మీకిబోయ, ఎస్సీ కాలనీ ప్రజల మద్దతు


మహిళలతో కలిసి కోలాటం ఆడుతున్న అరూరి

హసన్‌పర్తి, నవంబర్ 17: తనను ఆశీర్వదించి గెలిపిస్తే నియోజకవర్గాన్ని ఆదర్శంగా అభివృద్ధి చేస్తానని వర్ధన్నపేట బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేశ్ ప్రజలను కోరారు. గ్రేటర్ 1, 2, 55 డివిజన్ల పరిధిలోని గుండ్ల సింగారం, పెగడపల్లి, ముచ్చర్ల, పలివేల్పుల, ఎర్రగట్టు గుట్ట కాలనీ, భీమారం గ్రామాల్లో అరూరి శుక్రవారం ఇంటింటా ప్రచారం చేశారు. మహిళలు, పార్టీ శ్రేణులు కోలాటాలు, డప్పు చప్పుళ్లు, బతుకమ్మలు, మంగళహారతులతో స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ మాయమాటలు చెబుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఈ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. 70 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు ఏం చేసిందో చెప్పాలని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో పది మంది నాయకులు సీఎం అభ్యర్థులేనని ఎద్దేవా చేశారు. గాంధీ భవన్‌లో తగాదాలతో కాలం వెళ్లదీస్తున్నారే తప్పా ప్రజలకు ఏం చెప్పాలో క్లారిటీ వారికి లేదన్నారు. వారి మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని, కాంగ్రెస్‌కు ఓటు వేస్తే తెలంగాణను చిమ్మచీకట్లు చేస్తారని అన్నారు. డబ్బులు పెట్టి వర్ధన్నపేట టికెట్‌ను కొనుక్కున్న కాంగ్రెస్ వారు ప్రజలకు సేవా చేస్తారా అని అన్నారు. వర్ధన్నపేటను అన్ని రంగాలల్లో రూ.4,354కోట్లతో అభివృద్ధి చేయడమే కాకుండా సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. కారు గుర్తుకు ఓటు వేసి మూడోసారి భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసిన అరూరిని ప్రజలు మరోసారి ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. పెగడపెల్లికి చెందిన వాల్మీకి బోయ సంఘం నాయకులు, ఎస్సీ కాలనీ ప్రజలు అరూరికి మద్దతు ప్రకటించారు. కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్ రాజ్‌యాదవ్, జిల్లా రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ లలితాయాదవ్, రాష్ట్ర నాయకుడు రాకేశ్‌రెడ్డి, కార్పొరేటర్లు జక్కుల రజితా వెంకటేశ్వర్లు, లావుడ్య రవినాయక్, డివిజన్ అధ్యక్షులు నరెడ్ల శ్రీధర్, అటికం రవీందర్, మార్కెట్ డైరెక్టర్, ఆత్మ డైరెక్టర్ గనిపాక కల్పణా విజయ్, గ్రామ అధ్యక్షులు కుమార్‌యాదవ్, పోతరబోయిన లోకేశ్‌యాదవ్, రాయికంటి సురేశ్, మూల దేవేందర్, నంది శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ ప్రభాకర్, ఎర్రగట్టు గుట్ట ఆలయ చైర్మన్ లక్ష్మణ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి నాయకపు శ్రీనివాస్ ఉపాధ్యక్షుడు సుధాకర్, జిల్లా నాయకులు చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, గోవర్ధన్ పాల్గొన్నారు.

## 'అరూరి'కి ముదిరాజ్ కులస్తుల మద్దతు

నయీంనగర్: గ్రేటర్ వరంగల్ 43, 44వ డివిజన్ తిమ్మాపూర్ గ్రామ ముదిరాజ్ కులస్తులు బీఆర్‌ఎస్ పార్టీ వర్ధన్నపేట ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేశ్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతూ శుక్రవారం హనుమకొండ ప్రశాంత్‌నగర్‌లోని ఆయన నివాస ఆవరణలో మర్యాద పూర్వకంగా కలిశారు. అధ్యక్షుడు మేకల కుమారస్వామి, వల్లాల రాములు, సూరయ్య, ఐలయ్య, కుమారస్వామి, కృష్ణ, రాములు, శంకర్, ఎల్లయ్య, సారయ్య, శ్యామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.


అరూరి రమేశ్‌తో ముదిరాజ్ కులస్తులు


వర్ధన్నపేట సీహెచ్‌సీలో ఒకే రోజు జన్మించిన పసికందులు

## సీహెచ్‌సీలో ఒకేరోజు 10 ప్రసవాలు

### వర్ధన్నపేట సర్కారు దవాఖానలో పెరిగిన కాన్పులు

వర్ధన్నపేట, నవంబర్ 17: ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో ఒకేరోజు పది ప్రసవాలు జరిగాయి. సర్కారు దవాఖానల్లో రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన వసతులను కల్పించడంతోపాటు నిపుణులైన వైద్యులను నియమించడంతో వర్ధన్నపేట సీహెచ్‌సీలో కాన్పుల సంఖ్య గణనీయంగా పెరిగింది. జిల్లాలోనే అత్యధిక ప్రసవాలు జరుగుతున్న వర్ధన్నపేట సీహెచ్‌సీలో శుక్రవారం ఒకేరోజు 6 సాధారణ, 4 సిజేరియన్ మొత్తం 10 ప్రసవాలు జరిగాయి. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ నర్సింహస్వామి మాట్లాడుతూ మెరుగైన వసతులు, వైద్యులు నిత్యం అందుబాటులో ఉండడం వల్ల ప్రసవం కోసం పెద్ద సంఖ్యలో గర్భిణులు ఆస్పత్రిలో చేరుతున్నారని తెలిపారు. శుక్రవారం ఒకే రోజు పది మందికి ప్రసవాలు చేసినట్లు చెప్పారు. జూలై నెలలో 89, ఆగస్టులో 114, సెప్టెంబర్‌లో 89, అక్టోబర్‌లో 75 ప్రసవాలు జరిగినట్లు వివరించారు.


పైడిపల్లిలో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ షీభారాణి

## కేసీఆర్ బీమా పేద ప్రజలకు ఎంతో ధీమా

కాశీబుగ్గ, నవంబర్ 17: సీఎం కేసీఆర్ పేద, మధ్య తరగతి ప్రజల కోసం బీమా సౌకర్యం కల్పించడంతో వారికి ఎంతో ధీమా ఏర్పడుతుందని 3వ డివిజన్ కార్పొరేటర్ జన్ను షీభారాణీ అనిల్ అన్నారు. శుక్రవారం 3వ డివిజన్ పైడిపల్లిలోని 125వ బూత్ కన్వీనర్ జన్ను సారంగపాణి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ వర్ధన్నపేట అభ్యర్థి అరూరి రమేశ్ గెలుపు కోసం ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విలీన గ్రామాలను అరూరి చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు ఆదరించాలని కోరారు. జన్ను రాంబాబు, ల్యాదల్ల రమేశ్, బొల్లం విజయ్, జన్ను సదయ్య, మచ్చ విజేందర్, జన్ను రవి, సంపత్, కళాస్వామి, రంజిత్, శంకర్, గడ్డం రమేశ్, పసునూరి సంపత్, రాజమ్మ, జయమ్మ పాల్గొన్నారు.

## ఎన్నికల నిబంధనలను పాటించాలి

వర్ధన్నపేట, నవంబర్ 17: అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికల నిబంధనలను పాటించాలని కేంద్ర ఎన్నికల జనరల్ అబ్జర్వర్ షణ్ముగరాజన్ సూచించారు. నియోజకవర్గ కేంద్రంలోని ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయంలో ఆర్‌వో, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అధ్యక్షతన జరిగిన ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల అవగాహన సదస్సులో ఆయన పలు సూచనలు చేశారు. అభ్యర్థులతోపాటుగా రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉదయం 6 నుంచి రాత్రి 10గంటల వరకు మాత్రమే ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించాలన్నారు. సోషల్ మీడియాలో ఇతరుల మనోభావాలను దెబ్బతీసేలా పోస్టులు పెట్టొద్దని చెప్పారు. ఐఏఎస్ యాక్సిడెంచర్ అబ్జర్వర్ అమిత్‌ప్రతాప్ సింగ్, ఐఆర్‌ఎస్ రాజేశ్‌కుమార్, ఏఆర్‌వో విజయ్‌సాగర్, నోడల్ అధికారులు సంజీవరెడ్డి, రామిరెడ్డి, నాగనారాయణ పాల్గొన్నారు.

## మెట్టుగుట్టపై భక్తుల సందడి


మడికొండ: మెట్టు రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద శుక్రవారం నాగుల చవితి సందర్భంగా నాగసుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

# బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం


### పార్టీ రాష్ట్ర నాయకుడు ఈగ మల్లేశం


గులాబీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఈగ మల్లేశం

వర్ధన్నపేట, నవంబర్ 17: బీఆర్‌ఎస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పార్టీ రాష్ట్ర నాయకుడు ఈగ మల్లేశం అన్నారు. మండల కేంద్రానికి చెందిన పలువురు వివిధ పార్టీలకు నుంచి ఈగ మల్లేశం సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు తూల్ల కుమారస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ పదేళ్లలోనే ఎంతో అభివృద్ధి చేశారని తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో పేదరిక నిర్మూలన జరుగుతుందని చెప్పారు. అందుకే ఇతర పార్టీల్లో పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. తాను కూడా బీజేపీ నుంచి బీఆర్‌ఎస్ పార్టీలో ఇటీవల కేటీఆర్ సమక్షంలో చేరినట్లు చెప్పారు. బీఆర్‌ఎస్‌లో చేరిన కర్ర వెంకట్‌రెడ్డి, మురళీ, సంకినేని జనార్దన్, కాకర్ల ఎల్లయ్య, పొన్నం స్వామి, నాగెల్లి సురేశ్‌కు గులాబీ కండువాలు కప్పి స్వాగతించారు. జడ్పీటీసీ మార్గం భిక్షపతి, మున్సిపల్ చైర్ పర్సన్ ఆంగోత్ అరుణ, వైస్‌చైర్మన్ ఎలేందర్‌రెడ్డి, రామారం సర్పంచ్ వెంకట్‌రెడ్డి, సిలువేరు కుమారస్వామి, తుమ్మల యాకయ్య, జన్ను రాములు, కాంతం, ఎల్లగౌడ్ పాల్గొన్నారు.

## సీతానాగారంలో ఇంటింటా ప్రచారం

హసన్‌పర్తి, నవంబర్ 17: వర్ధన్నపేట బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేశ్ గెలుపు కోసం పార్టీ గ్రామ అధ్యక్షుడు సోనబోయిన రవియాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని సీతానాగారంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టో పోస్టర్ చూపిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి అరూరిని గెలిపించాలని అభ్యర్థించారు. సర్పంచ్ బోయిని ఐలయ్య, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పెద్ది కరుణాకర్ రెడ్డి, గ్రామ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, యూత్ వైస్ ప్రెసిడెంట్ ప్రశాంత్, రవి, సంపత్, శ్రీకాంత్ రెడ్డి, వంశీ, సురేశ్, రాజు, చంద్రమౌళి, రాకేశ్ పాల్గొన్నారు.


సీతానాగారంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

వర్ధన్నపేట, నవంబర్ 17: రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించేందుకు ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ జేడీఏ ఉషాదయాళ్ సూచించారు. మండల కేంద్రంలోని ఫిరంగిగడ్డలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి నష్టపోకుండా ప్రభుత్వమే కొనుగోలు చేసేందుకు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకొని తేమ శాతం సరిగ్గా ఉండేలా చూసుకొని తీసుకురావాలని కోరారు. మండలంలోని ఇల్లంద వ్యవసాయ మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలోనూ శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అధికారులు ప్రారంభించారు. ఏడీఏ సురేశ్‌కుమార్, ఏవో రాంనర్సయ్య, మహిళా సంఘాల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.


వర్ధన్నపేటలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జేడీఏ